# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 25 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4


## హైదరాబాద్‌లో నేడు ట్రాఫిక్ ఆంక్షలు..!

బలగం టీవీ ,న్యూఢిల్లీ

హైదరాబాద్ లో ఆదివారం ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నాయి. నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వరకు 'హైదరాబాద్ రన్నర్స్ మారథాన్ రన్' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆదివారం ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేశారు. ఉదయం 4.30 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. పీపుల్స్ ప్లాజా, ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్ బండ్, చిల్డ్రన్స్ పార్క్, సెయిలింగ్ క్లబ్, బుధా భవన్, సంజీవయ్య పార్క్, ఖైరతాబాద్, రాజ్ భవన్ రోడ్, సోమాజిగూడ, పంజాగుట్ట ఫ్లైఓవర్, ఎంజే కాలేజీ, ఎస్ఎన్‌టీ జంక్షన్, సాగర్, సొసైటీ, కేబీఆర్ పార్క్, జూబ్లీ హిల్స్ చెక్‌పోస్ట్, రోడ్ నెం 45, కేబుల్ బ్రిడ్జ మార్గంలో మారథాన్ రన్ జరగనుండగా.. ఈ మార్గాల్లో అవసరాన్ని బట్టి మళ్లింపులు విధిస్తామని పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ రద్దీని నివారించడానికి పౌరులు మారథాన్ జంక్షన్లు, మార్గాలను నివారించాలని, గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను తీసుకోవాలని పోలీసులు కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో, సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203626కు కాల్ చేయవచ్చు.

# ఏకీకృత పెన్షన్ స్కీమ్ ఆమోదం




- కేంద్రం కీలక నిర్ణయం

బలగం టీవీ ,న్యూఢిల్లీ

కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. కొత్త పెన్షన్ స్కీమ్‌కి బదులుగా కొత్తగా ఏకీకృత పెన్షన్ స్కీమ్ ప్రారంభించాలని నిర్ణయించింది. కేంద్రమంత్రి వర్గల సమావేశంలో కొత్త పెన్షన్ స్కీమ్‌పై ఏకాభిప్రాయం కుదిరింది. కేబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు. ఎన్‌పీఎస్ పథకాన్ని మెరుగుపరచాలని దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల నుంచి ఎప్పటి నుంచో డిమాండ్ ఉందన్నారు. ఇందులో సంస్కరణల కోసం ఏప్రిల్ 2023లో ప్రధాని నరేంద్ర మోదీ ఓ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. కమిటీకి డాక్టర్ సోమనాథన్ చైర్మన్‌గా ఉన్నారన్నారు.

కమిటీ వందకుపైగా ప్రభుత్వ ఉద్యోగుల సంస్థలతో సంప్రదింపులు జరిపిందని.. దాదాపు అన్ని రాష్ట్రాలతోనూ చర్చలు జరిపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంస్థలకు సైతం ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఈ అంశాన్ని ప్రధాని సీరియస్‌గా తీసుకున్నారని.. కమిటీ సిఫారసు మేరకు ఏకీకృత పింఛన్ స్కీమ్‌కు ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ఇక 25 ఏళ్లు పనిచేసే ఉద్యోగికి పూర్తి పెన్షన్ వస్తుందని ప్రభుత్వం పేర్కొంది. యూపీఎస్ స్కీమ్ ద్వారా 23లక్షల మంది కేంద్ర ఉద్యోగులు లబ్ధి పొందనుండగా.. ఏప్రిల్ 1, 2025 నుంచి అమలులోకి రాబోతున్నది. పదేళ్లు సర్వీస్ చేసిన వారికి రూ.10వేల పెన్షన్ వస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగులు సర్వీసులో ఉండగా మరణిస్తే వారి భార్యలకు 60శాతం పెన్షన్ ఇస్తారని పేర్కొన్నారు. సర్వీస్‌లో 25 సంవత్సరాలు పూర్తయిన వారికి పూర్తి పెన్షన్ స్కీమ్‌ని కేంద్రం తెచ్చింది. మరో వైపు కేంద్ర ప్రభుత్వం బయో ఈ–3 విధానానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే 11, 12వ తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) సమీకృత కేంద్ర రంగ పథకం 'సైన్స్ స్ట్రీమ్'లో విలీనమైన మూడు ప్రధాన పథకాలను కొనసాగించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. 'విజ్ఞాన్ ధార' పథకం ప్రాథమిక లక్ష్యం దేశంలో సైన్స్, టెక్నాలజీ, ఆవిష్కరణలకు సంబంధించిన పర్యావరణ వ్యవస్థను పటిష్ఠం చేయడం కోసం శాస్త్ర, సాంకేతికతలో సామర్థ్య పెంపుతో పాటు పరిశోధన, ఆవిష్కరణ–సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహించడం. ఈ పథకం అమలు విద్యాసంస్థల్లో పూర్తిగా సన్నద్ధమైన పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాలలను ప్రోత్సహించడం ద్వారా దేశంలోని శాస్త్ర సాంకేతిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయనున్నది.

## 2026 నాటికి నక్సలిజానికి తెర




- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

బలగం టీవీ ,న్యూఢిల్లీ

మావోయిస్టుల హింస ప్రజాస్వామ్యానికి సవాలుగా మారిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఇప్పటివరకు 17 వేలమంది దీనికి బలయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే నక్సల్స్ అంతానికి బలమైన, పకడ్బందీ వ్యూహం అవసరమన్నారు. ఈ అంశంపై ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పుర్‌లో శుక్రవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశంలో కేంద్ర మంత్రి పాల్గొని మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 2004–14 వ్యవధితో పోలిస్తే 2014–24 మధ్యకాలంలో నక్సల్స్ సంబంధిత ఘటనల్లో 53 శాతం తగ్గుదల నమోదైనట్లు కేంద్రమంత్రి తెలిపారు. 2026 మార్చి నాటికి వామపక్ష తీవ్రవాదం నుంచి దేశాన్ని విముక్తి చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు కేంద్రం కృషి చేస్తోందన్నారు. ఏకకాలంలో భద్రతా కార్యకలాపాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్ఐఏ, ఈడీ వంటి కేంద్ర సంస్థలు మావోయిస్టు హింస నిర్మూలనకు కృషి చేస్తున్నాయని తెలిపారు.

## "నేను రాను బిడ్డ సర్కారు దవాఖానానకు"



- ఆ రోజులు పునరావృతం అయ్యాయి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

బలగం టీవీ , హైదరాబాద్

కాంగ్రెస్ పాలన పుణ్యమా అని మళ్లీ.. "నేను రాను బిడ్డ సర్కారు దవాఖానానకు" అనే రోజులు పునరావృతం అయ్యాయని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ వైద్య రంగం ఉన్నత శిఖరాలకు చేరిందన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. అనేక విప్లవాత్మక పథకాలకు, తెలంగాణ రాష్ట్రం శ్రీకారం చుట్టి విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు.నిర్దిష్టమైన ప్రణాళిక, పటిష్టమైన చర్యలతో వైద్యరంగంలో అట్టడుగున ఉన్న తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిందని హరీశ్‌రావు అన్నారు. కానీ ఈ తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో వైద్య, ఆరోగ్య రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు.

రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యం పేద ప్రజలకు శాపంగా మారిందని తెలిపారు. బీ ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాస్పటల్స్ ఘనతను చాటేలా వార్తలు వస్తే, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆసుపత్రుల అధ్వాన్న పరిస్థితుల గురించి రోజూ వార్తలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "పడకేసిన ప్రజారోగ్యం, రోగుల మందులు ఎలుకల పాలు, కుర్చీలోనే గర్భిణీ డెలివరీ, ఒకే బెడ్ పై ముగ్గురికి ట్రీట్మెంట్" ఇవన్నీ ఈ ఒక్క రోజు పత్రికల్లో వైద్య ఆరోగ్యశాఖపై నిర్వాకంపై వచ్చిన వార్తా కథనాలు అని ప్రస్తావించారు. ప్రజారోగ్య సంరక్షణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వా నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనమని తెలిపారు.

వానాకాలం వస్తున్నప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోకపోవడం ఆస్పత్రుల సన్నద్ధతపై సమీక్షలు నిర్వహించకపోవడం పారిశుధ్యాన్ని పట్టించుకోకపోవడం వల్ల మలేరియా, డెంగీ లాంటి సీజనల్ రోగాలు విజృంభిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. పల్లె, పట్టణం అని తేడా లేకుండా వైరల్ ఫీవర్లతో ప్రతి ఇద్దరిలో ఒకరు బాధపడుతున్నారని.. ఆస్పత్రుల్లో పడకలు దొరకని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గడచిన నెలన్నర కాలంలో 5246 డెంగీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే 36% డెంగీ కేసులు అధికంగా నమోదయ్యాయని అధికారిక లెక్కలు తెలుపుతున్నాయని అన్నారు. జ్వరాలతో ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందంటే రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఏం చేస్తున్నట్టు? అని మండిపడ్డారు.

మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలని ఊదరగొట్టిన కాంగ్రెస్ పార్టీ ఇపుడు ఏమని సమాధానం చెబుతుందని నిలదీశారు. మీకు రాజకీయాలపై ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై లేకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ఎంతోమంది కుటుంబాల్లో అంతులేని దుఃఖాన్ని మిగిలించిందని అన్నారు. ఈ మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని స్పష్టం చేశారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. మరణించిన వారికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలంటే ఇంకా ఎన్ని ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వైద్య ఆరోగ్యశాఖపై అత్యవసర సమీక్ష నిర్వహించాలని, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.



## త్వరలో సరికొత్తగా విద్యుత్ నియంత్రణ మండలి

బలగం టీవీ ,న్యూఢిల్లీ

తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి ఏర్పాటు దిశగా ప్రభుత్వం వేగం పెంచింది. రానున్న రెండు మాసాల్లో టీజీఈఆర్సీ పదవీ కాలం ముగిసి ఈ మండలి మొత్తం ఖాళీ కానుంది. ఈ నేపథ్యంలో తదుపరి పాలక మండలి దిశగా ప్రభుత్వం సన్నాహాలు అనివార్యమయ్యాయి. డిస్కమ్‌ల వార్షిక ఆదాయ అవసరాలు (ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలతో పాటు విద్యుత్ సంస్థల ఏ పిటిషన్ విచారించడానికి ఈ కమిషన్ ఏర్పాటు తక్షణావసరం కానుంది. 2019 అక్టోబరులో నియమితమైన ప్రస్తుత ఛైర్మన్, సభ్యుల పదవీ కాలం అక్టోబరు 29వ తేదీతో ముగియనుంది. విద్యుత్తు చట్టం–2003లోని సెక్షన్–85 ప్రకారం ఛైర్మన్, సభ్యులు ఐదేళ్లు లేదా 65 ఏళ్లు నిండే వరకే పదవిలో ఉండాలి. దీంతో కొత్తగా మొత్తం పాలక మండలి నియామకం అనివార్యంగా మారింది.

కాగా, విభజన అనంతరం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు రెండు కమిషన్లు ఏర్పడగా.. ఏపీలో హైకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తులనే ఛైర్మన్లుగా నియమించడం ఆనవాయితీగా కొనసాగుతూ వచ్చింది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణలో ఒకసారి విద్యుత్ రంగ నిపుణుడిని, మరోసారి న్యాయవాదిని నియమించారు. ప్రస్తుతం సభ్యులుగా దక్షిణ డిస్కమ్ పూర్వ అధికారితో పాటు ఓ చార్టర్డ్ అకౌంటెంట్ ఉన్నారు. దీంతో ఈసారైనా హైకోర్టు మాజీ సీజేలకు చోటు కల్పిస్తారా? గత ప్రభుత్వం అనుసరించిన సంప్రదాయాన్ని కొనసాగిస్తారా? అనేది తేలాల్సి ఉంది.



## నిర్మలా సీతారామన్‌తో డిప్యూటీ సీఎం భేటీ

బలగం టీవీ ,న్యూఢిల్లీ

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. అందులో భాగంగా శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కలిశారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితిని వివరించి.. రాష్ట్ర అభివృద్ధికి సహకరించాల్సిందిగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరాం అన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. మొత్తం 8 అంశాలను ఆర్థికమంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. విభజన చట్టంలోని నిధుల పంపకం త్వరితగతిన చేయాలని కోరినట్టు వెల్లడించారు భట్టి. గత ప్రభుత్వం చేసిన అప్పులు రాష్ట్రానికి భారంగా మారాయని, ప్రతినెలా వేతనాలకంటే ఎక్కువగా అప్పులు, వాటి వడ్డీలు చెల్లించేందుకే పోతున్నాయని తెలిపారు. చెరువులు, కొండలను కాపాడాలనేదే తమ లక్ష్యమని, హైడ్రాకు ప్రజలు సహకరించాలని భట్టి కోరారు. చట్టం ప్రకారమే నిర్ణయాలు ఉంటాయన్నారు. లెక్కలతో సహా ఎన్ని చెరువులు కబ్జాకు గురి అయ్యాయో ప్రజల ముందు పెడతామని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు.

### బీబీనగర్ ఎయిమ్స్‌కు
## హైదరాబాద్‌లో భవనం కేటాయించండి



బలగం టీవీ , హైదరాబాద్

బీబీనగర్ ఎయిమ్స ఎక్స్‌టెన్షన్ కోసం హైదరాబాద్‌లో తాత్కాలికంగా ఒక ప్రభుత్వ భవనాన్ని కేటాయించాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ కేంద్రం ద్వారా వైద్య విద్యార్థులకు అవసరమైన బోధన శిక్షణ కార్యక్రమాలు, నగరంలో నివసిస్తున్న ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని లేఖలో పేర్కొన్నారు.ఎయిమ్స బీబీనగర్ హైదరాబాద్ నగరంలో ఒక అర్బన్ హెల్త్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కేంద్రం ద్వారా వైద్య విద్యార్థులకు అవసరమైన బోధన శిక్షణ కార్యక్రమాలను, నగరంలో నివసిస్తున్న ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి వీలుగా ఉంటుందని లేఖలో ఆయన పేర్కొన్నారు.

ఎయిమ్స బీబీనగర్ ఎక్స్‌టెన్షన్ కోసం హైదరాబాద్ నగరంలో తాత్కాలికంగా ఒక ప్రభుత్వ భవనాన్ని కేటాయించినట్లయితే, అక్కడ ఎయిమ్స బీబీనగర్‌కు అనుబంధంగా అర్బన్ హెల్త్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేసి, నగరంలో నివసిస్తున్న ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను వెంటనే అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు.

అలాగే నగరం నడిబొడ్డున 2 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించినట్లయితే అర్బన్ హెల్త్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌కు శాశ్వత భవనాన్ని నిర్మాణం చేయడానికి ఎయిమ్స బీబీనగర్ సిద్ధంగా ఉందన్నారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ 26.07.2024 న డిప్యూటీ డైరెక్టర్, ఎయిమ్స బీబీనగర్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఈ విషయంపై సీఎం ప్రత్యేకమైన దృష్టిసారించాలని కోరారు. ఎయిమ్స అర్బన్ హెల్త్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌కు శాశ్వత భవన నిర్మాణాన్ని చేపట్టడానికి హైదరాబాద్ నగరంలో ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా 2 ఎకరాల భూమిని ఎయిమ్స బీబీనగర్‌కు కేటాయించాలని పేర్కొన్నారు. అంతవరకూ తాత్కాలికంగా అందుబాటులో ఉన్న ఏదైనా ప్రభుత్వ భవనాన్ని కేటాయించి అర్బన్ హెల్త్ అండ్ ట్రైనింగ్ సెంటర్ సేవలను వెంటనే ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సహకరించాలని కోరారు.

## మహిళా కమిషన్ కార్యాలయానికి కేటీఆర్

- తీవ్ర ఉద్రిక్తత

బలగం టీవీ , హైదరాబాద్

తన కామెంట్స్‌పై వివరణ ఇచ్చేందుకు కేటీఆర్ మహిళా కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. మరోవైపు కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ.. మహిళా కాంగ్రెస్ నేతలు ఆందోళనలకు దిగారు. బీఆర్ఎస్ నేతలు కూడా అక్కడికి చేరుకోవడంతో.. ఇరు వర్గాల మహిళా నేతల మధ్య తోపులాట చోటు చేసుకుంది.

ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంపై కేటీఆర్ చేసిన కామెంట్స్‌పై మహిళా సమాజం నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. దీంతో తన వ్యాఖ్యల పట్ల ఆయన ఎక్స్‌లో విచారం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనకు మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కమిషన్‌కు వివరణ ఇచ్చేందుకు 11 గంటల సమయంలో కార్యాలయంకు వచ్చారు కేటీఆర్. ఈ సమయంలో తీవ్ర ఉద్రిక్తత చెలరేగింది. కేటీఆర్ వాహనాన్ని అడ్డుకునేందుకు మహిళా కాంగ్రెస్ నేతలు యత్నించారు. కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ.. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సమయంలోనే అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ మహిళా నేతలు పోటీగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య ఘర్షణ, తోపులాట చెలరేగింది. ఇరువర్గాలను అదుపుచేసేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. కేటీఆర్ ఎందుకు క్షమాపణ చెప్పాలని ప్రశ్నిస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అవసరమైనన్ని బస్సులు ఏర్పాటు చేయలేకపోవడం వల్ల.. ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెబుతున్నారు.

ఇదిలా ఉండగా తాను యథాలాపంగా చేసిన వ్యాఖ్యల పట్ల ఇప్పటికే విచారం వ్యక్తం చేశానని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. మహిళా కమిషన్ ముందు విచారణకు హాజరైన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు

మిగితా 2వ పేజీలో

# ఎన్ కన్వెన్షన్ కూల్చివేత

- అది పట్టా భూమి : అక్కినేని నాగార్జున
- మూడున్నర ఎకరాల భూమి కబ్జా చేశారు : కమిషనర్ రంగనాథ్
- కూల్చివేతలు ఆపండి : హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

బలగం టీవీ ,వయనాడ్

హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన భూములు కలిగిన మాదాపూర్ సమీపంలోగల ఖానామెట్ గ్రామ పరిధిలోని తమ్మిడికుంట చెరువు బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మించిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) నేలమట్టం చేసింది. చెరువు ఆక్రమణపై హైడ్రాకు అందిన ఫిర్యాదుల మేరకు జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్, హైడ్రా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు శనివారం భారీ బందోబస్తు నడుమ సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ నిర్మాణాలను కూల్చి వేశారు.



తుమ్మిడికుంట చెరువులోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని ఆక్రమణలను హైడ్రా, జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్, ఇరిగినేషన్, రెవెన్యూ శాఖ అధికారులు తొలగించినట్లు పేర్కొన్నారు. తొలగించిన అనేక నిర్మాణాల్లో అనధికారిక నిర్మాణంగా ఉన్న ఎన్ కన్వెన్షన్ ఒకటని రంగనాథ్ తెలిపారు. 2014లో హెచ్ఎండీఏ తుమ్మిడికుంట చెరువు పూర్తి స్థాయి నీటి మట్టం, బఫర్ జోన్లకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చిందని, 2016లో తుది నోటీఫికేషన్ జారీ చేసిందని తెలిపారు.


2014లో ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశాక ఎన్ కన్వెన్షన్ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు సంబంధించి చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించాలని హైకోర్టు ఎన్ కన్వెన్షన్‌ను ఆదేశించిందని, ఆ ప్రకారం ఎన్ కన్వెన్షన్ యాజమాన్యం సమక్షంలోనే ఎఫ్‌టీఎల్ సర్వే జరిగినట్లు తెలిపారు. ఆ సర్వే నివేదికపై 2017లో ఎన్ కన్వెన్షన్ మియాపూర్ అదనపు జిల్లా కోర్టును ఆశ్రయించిందని, ఆ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉందే తప్ప ఎలాంటి స్టే ఇవ్వలేదన్నారు.

అదేవిధంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మించిన అనధికారిక నిర్మాణాల ద్వారా ఎన్ కన్వెన్షన్ వ్యవస్థను తారుమారు చేసి వాణిజ్య కార్యకలాపాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో 1 ఎకరా 12 గుంటలు, బఫర్ జోన్ లో 2 ఎకరాల 18 గుంటలు ఆక్రమించి అనధికారిక నిర్మాణాలు చేపట్టారని, వాటికి జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి భవన నిర్మాణ అనుమతులు లేవని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. భవన నిర్మాణ అనుమతుల కోసం ప్రయత్నించగా అధికారులు తిరస్కరించారని వివరించారు.

తుమ్మిడికుంట చెరువు ఆక్రమణల వల్ల నీటి నిల్వ సామర్థ్యం 50 నుంచి 60 శాతం మేర కుంచించుకుపోవడంతో దిగువ ప్రాంతాలు నిత్యం భారీ వర్షాల వల్ల ముంపునకు గురవుతున్నాయన్నారు. దిగువ, మధ్య తరగతి ప్రజల ఇళ్లలోకి వరద నీరు చేరి తీవ్ర ఆస్తినష్టం వాటిల్లుతుందన్నారు. ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని నిబంధనల ప్రకారం తుమ్మిడికుంట చెరువులోని అనధికారిక నిర్మాణాలను పూర్తిగా కూల్చివేసినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.



ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందించారు. హస్తిన పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. చెరువులు ఆక్రమణకు గురికాకూడదనే హైడ్రా ఏర్పాటు చేశామన్న భట్టి, హైడ్రాను ప్రజలందరూ ఆహ్వానిస్తున్నారని తెలిపారు. ప్రతి పనికి నోటీసులు ఇచ్చాక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. నేరుగా చెరువులో కట్టిన నిర్మాణాలను కూల్చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పదేళ్లలో చెరువుల ఆక్రమణపై శాటిలైట్ ఫొటోల ద్వారా గుర్తిస్తున్నామన్న ఉప ముఖ్యమంత్రి, విభజనకు ముందు, తర్వాత చెరువుల ఆక్రమణలు గుర్తించి, ఆ వివరాలు ప్రజలముందుంచుతామని వెల్లడించారు. ప్రజల ఆస్తులు కాపాడటం ప్రభుత్వ బాధ్యతని భట్టి విక్రమార్క తెలిపారు.



**స్టే ఆర్డర్‌లు మరియు కోర్టు కేసులకు విరుద్ధంగా ఎన్ కన్వెన్షన్‌కు సంబంధించి కూల్చివేతలు చేపట్టడం బాధాకరం. మా ప్రతిష్టను కాపాడటం కోసం, కొన్ని వాస్తవాలను తెలియజేయడం కోసం మరియు చట్టాన్ని ఉల్లంఘించేలా మేము ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలుపుట కొరకు ఈ ప్రకటనను జారీ చేయడం సరైనదని నేను భావించాను.**

**ఆ భూమి పట్టా భూమి. ఒక్క అంగుళం ట్యాంక్ ప్లాన్ కూడా ఆక్రమణకు గురికాలేదు. ప్రైవేట్ స్థలంలో నిర్మించిన భవనమిది. కూల్చివేత కోసం గతంలో ఇచ్చిన అక్రమ నోటీసుపై స్టే కూడా మంజూరు చేయబడింది.**

**స్పష్టంగా చెప్పాలంటే, కూల్చివేత తప్పుడు సమాచారంతో లేదా చట్ట విరుద్ధంగా జరిగింది.**

**ఈరోజు ఉదయం కూల్చివేతకు ముందు మాకు ఎలాంటి నోటీసు జారీ చేయలేదు. కేసు కోర్టులో ఉన్నప్పుడు ఇలా చేయడం సరికాదు. చట్టాన్ని గౌరవించే పౌరుడిగా, కోర్టు నాకు వ్యతిరేకంగా తీర్పునిస్తే, కూల్చివేత నేనే నిర్వహించి ఉండేవాడిని.**

**తాజా పరిణామాల వల్ల, మేము ఆక్రమణలు చేశామని, తప్పుడు నిర్మాణాలు చేపట్టామని ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్ళే అవకాశముంది. ఆ అభిప్రాయాన్ని పోగొట్టాలనేదే మా ప్రధాన ఉద్దేశం.అధికారులు చేసిన ఈ చట్ట విరుద్ధ చర్యలకు వ్యతిరేకంగా మేము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. అక్కడ మాకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాను.**

**-అక్కినేని నాగార్జున**

### గుజరాత్‌లో
# నగర సైబర్ క్రైమ్ పోలీసుల భారీ ఆపరేషన్

**బలగం టీవీ, హైదరాబాద్**

నగరంలోని సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. 7 బృందాలతో గుజరాత్‌లో కీలక ఆపరేషన్ చేశారు. ఛార్టెడ్ అకౌంటెంట్ సహా 36 మంది సైబర్ నేరస్థులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఏడుగురు దేశవ్యాప్తంగా పలు కేసుల్లో కీలక నిందితులుగా ఉన్నట్లు హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పెట్టుబడుల పేరుతో మోసాల్లో 11 మంది, ట్రేడింగ్ మోసంలో నలుగురు, కేవైసీ మోసంలో ఒకరిని అరెస్టు చెప్పారు. నిందితులపై దేశవ్యాప్తంగా 983 కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ దర్యాప్తు కొనసాగుతోందని సీపీ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. కేసులో కీలక నిందితులను ఇప్పటికే అరెస్టు చేశామన్నారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, శ్రవణ్ రావులపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని సీబీఐ డైరెక్టర్‌ని కోరామన్నారు. సీబీఐ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసిన తర్వాత వారిని దేశానికి తీసుకొస్తామన్నారు. ఈ కేసుతో సంబంధమున్న వారందర్నీ విచారిస్తామని స్పష్టం చేశారు.

# వయనాడ్‌లో పర్యటించిన మంత్రి సీతక్క

**బలగం టీవీ ,వయనాడ్**

ప్రకృతి విలయానికి అతలాకుతమైన కేరళలోని వయనాడ్ లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అనసూయ సీతక్క శనివారం పర్యటించారు. ములుగు డిసిసి అధ్యక్షుడు పైడాకుల అశోక్ తో కలిసి ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన మంత్రి సీతక్క, బాధిత కుటుంబాల సహాయార్థం తాను సేకరించిన రూ.20 లక్షల చెక్‌ను స్థానిక ఎమ్మెల్యే టి.సిద్దికికి అందించారు. దీంతో పాటు సుమారు పది లక్షల విలువైన దుస్తులు, నిత్యావసర వస్తువులను స్థానిక నాయకులు అందజేశారు. వందల సంఖ్యలో మృతులను సామూహిక ఖననం చేసిన ముండక్కై స్మశాన వాటికలో మృతులకు మంత్రి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అక్కడి మీడియాతో మాట్లాడిన సీతక్క ఇటువంటి కష్టం పగోడికి కూడా రావోద్దన్నారు. ప్రభావితమైన ప్రాంతాలను చూసి హృదయం ద్రవించిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పోయిన ప్రాణాలను తీసుకురాలేకపోయినా తనకు ఎంతో అనుబంధం ఉన్న వయనాడ్ ప్రజలకు నైతిక మద్దతు పలకానికి వచ్చినట్లు తెలిపారు. వాయనాడ్ ఎల్లప్పుడూ తన హృదయానికి దగ్గరగా ఉంటుందన్నారు. నేటికి 24 గంటలూ పనిచేస్తున్న సహాయ బృందాలు, స్థానిక అధికారులు, వాలంటీర్ల అవిశ్రాంత ప్రయత్నాలను అభినందిస్తున్నట్లు వెల్లడించారు. సీతక్క ప్రయత్నాలను తెలుసుకున్న పలువురు నాయకులు తమ వంతు సహకారం అందించారు. ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, టీపీపీసీ ప్రధాన కార్యదర్శి సత్తుమల్లేష్ తదితర నాయకులు ఆర్థికంగా సహకరించారు. ములుగు, ఆదిలాబాద్ పార్టీ శ్రేణులు ముందుకొచ్చి చేయుత నిచ్చారు. మంత్రి సీతక్క భద్రత, వ్యక్తిగత సిబ్బంది సైతం తమ వంతుగా రూ.50 వేల సహాయం చేశారు. వయనాడ్ ప్రజల కోసం ముందు కొచ్చి నిధులు, వస్తువులు అందచేసిన వారికి, బాలవికాస్ వంటి స్వచ్ఛంధ సంస్థలకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళా కమిషన్ కార్యాలయానికి కేటీఆర్



(మొదటి పేజీ తరువాయి)

కమిషన్ కార్యాలయం వద్దకు వచ్చి రాజకీయం చేశారన్నారు. భారాస మహిళా నేతలపై దాడి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలను గౌరవించాలని విచారణకు వచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలోని సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, వసతి గృహాల్లో పిల్లల సమస్యలపై ప్రస్తావించినట్లు కేటీఆర్ తెలిపారు. అంతకుముందు విచారణ సందర్భంగా కేటీఆర్‌కు మహిళా కమిషన్ సభ్యులు రాఖీలు కట్టారు.


**మా వాళ్లపై జరిగిన దాడిపై మహిళా కమిషన్ చర్యలు తీసుకోవాలి : కేటీఆర్**

చట్టాన్ని గౌరవిస్తూ తాము మహిళా కమిషన్ ముందుకు వస్తే, తమ నాయకురాళ్లపై మహిళా కాంగ్రెస్ నాయకులు దాడి చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. తమపై జరిగిన దాడి మీద కూడా మహిళా కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా కమిషన్ ఇచ్చిన నోటీసులపై వివరణ ఇచ్చేందుకు హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లో మహిళా కమిషన్ కార్యాలయానికి శనివారం వచ్చారు. వివరణ ఇచ్చిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

మహిళ కమిషన్ ఇచ్చిన ఆదేశం మేరకు వ్యక్తిగతంగా కమిషన్ ముందు హాజరయ్యానని కేటీఆర్ తెలిపారు. తాను యథాలాపంగా మాట్లాడిన మాట పట్ల విచారం వ్యక్తం చేశానని కమిషన్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. చట్టాన్ని, మహిళలను గౌరవించే వ్యక్తిగా తాను మాట దొర్లటంపై క్షమాపణ అడిగానని చెప్పారు. చట్టాన్ని గౌరవిస్తూ తాము కమిషన్ ముందుకు వస్తే మహిళా కాంగ్రెస్ నేతలు మా మహిళా కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. నెయిల్ కట్టర్ చాకులతో గాయపరిచారని, వారిపై కూడా మహిళా కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలను గౌరవించాలనే ఉద్దేశంతో తాము వస్తే రాజకీయ దురుద్దేశంతో ఇలాంటి దాడి చేయటం సరికాదని కేటీఆర్ అన్నారు. ఈ ఘటనపై పోలీసులు చర్య తీసుకోవాలని.. కమిషన్ సుమోటోగా తీసుకోవాలని కోరారు. ఎనిమిది నెలల్లో మహిళలపై జరిగిన సంఘటనలను వారికి ఇచ్చే ప్రయత్నం చేశానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న పరిస్థితులు, దాడుల విషయంలో కమిషన్ చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ దృష్టికి తీసుకొచ్చానని అన్నారు. రాష్ట్రంలో కొరవడిన మహిళా భద్రత, విద్యార్థుల పట్ల లైంగిక దాడులు వంటి అంశాలను ప్రస్తావించేందుకు అన్ని వివరాలతో తాను వెళ్లానని తెలిపారు. మరోసారి రావాలని కమిషన్ చెప్పిందన్నారు. తప్పకుండా వారు కోరినట్టుగా మళ్లీ సమయం తీసుకొని వస్తామని తెలిపారు. తాను ఇచ్చిన వివరణపై కమిషన్ ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలని అన్నారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని.. తప్పు చేస్తే క్షమాపణ అడగాలని అన్నారు. తాను అందుకే ఒక్క మాట దొర్లితే మహిళలను గౌరవించే వ్యక్తిగా క్షమాపణ అడిగానని పేర్కొన్నారు.

# "నేనే తప్పూ చేయలేదు .. నన్ను ఇరికించారు "

- **కోల్‌కతా హత్యాచార కేసులో నిందితుడు**
- **పాలిగ్రాఫ్ పరీక్షకు నిందితుడు ఓకే**



**బలగం టీవి, హైదరాబాద్**

"నేనే తప్పు చేయలేదు .. నన్ను ఇందులో ఇరికించారు " అని కోల్‌కతా డాక్టరుపై హత్యాచార కేసుకు సంబంధించి అరెస్టయిన నిందితుడు సంజయ్ రాయ్ చెబుతూ భావోద్వేగానికి గురయ్యాడు..! నిందితుడిని సిబిఐ అధికారులు కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో పాలిగ్రాఫ్ పరీక్షకు నిందితుడు సమ్మతించడంతో కోర్టు అధికారులకు అనుమతినిచ్చింది. అయితే, విచారణ సందర్భంగా సంజయ్ రాయ్ న్యాయస్థానంలో సంచలన ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. తనను కావాలనే ఇరికించారని కన్నీళ్లు పెట్టుకున్నట్లు సమాచారం. ఈ మేరకు పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పాలిగ్రాఫ్ పరీక్షకు ఎందుకు సమ్మతిస్తున్నావ్ ? అని మేజిస్ట్రేట్ నిందితుడిని ప్రశ్నించగా, అతడు భావోద్వేగానికి గురైనట్లు తెలిసింది. " నేను అమాయకుడిని. ఏ తప్పు చేయలేదు. నన్ను ఇందులో ఇరికించారు. ఈ పరీక్షతో అసలు విషయం బయటపడుతుంది " అని సంజయ్ రాయ్ చెప్పినట్లు సమాచారం. దీంతో ఈ కేసు మరో కీలక మలుపు తిరిగింది.

## ఐసెట్ షెడ్యూల్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, టీజీ ఐసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ శ్రీదేవసేన మాసబ్ట్యాంకులోని టీజీసీహెచ్ఈ కార్యాలయంలో శనివారం ఐసెట్ షెడ్యూల్ విడుదల చేశారు. సెప్టెంబర్ 1 నుంచి 8వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు ఉంటుంది. 3–9వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, 4 నుంచి 11వరకు వెబ్‌ఆప్షన్లకు, 14న తొలిదశ సీట్ల కేటాయింపు ఉంటుంది.

# తెలంగాణలో కాంగ్రెస్‌ను ఎవరు రక్షిస్తున్నారు

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణలో కాంగ్రెస్‌ను ఎవరు రక్షిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కర్నాటక వాల్మీకి స్కామ్‌తో రాష్ట్ర నేతలు, వ్యాపారవేత్తలకు లింకులు ఉన్నాయని చెప్పారు. కర్నాటక ఎస్టీ కార్పొరేషన్ నుంచి హైదరాబాద్‌లోని తొమ్మిది బ్యాంకు అకౌంట్లకు ?45 కోట్లు బదిలీ అయ్యాయి. అందులో వీ6 బిజినెస్ ఓనర్‌కు ?4.5 కోట్లు బదిలీ అయ్యాయయని, అతడు ఎవరని నిలదీశారు.

లోక్‌సభ ఎన్నికల వేళ నగదు డ్రా చేసిన బార్లు, బంగారు దుకాణాల నిర్వాహకులు ఎవరన్నారని కేటీఆర్? ప్రశ్నించారు. వారికి కాంగ్రెస్‌తో ఉన్న సంబంధం ఏంటన్నారు. వాల్మీకి స్కామ్‌కు సంబంధించి రాష్ట్రంలో సిట్, సీఐడీ, ఈడీ సోదాలు జరిగాయని, దర్యాప్తు సంస్థల సోదాల వార్తలు బయటకు రాకుండా అణచివేశారని అన్నారు. 90 కోట్లు అవినీతి జరిగిందని కర్నాటక అసెంబ్లీలో సీఎం సిద్ధరామయ్య ప్రకటించారని కేటీఆర్ చెప్పారు. సిద్ధరామయ్యను తొలగిస్తే తెలంగాణ ప్రభుత్వమూ కూలిపోతుందని కర్నాటక మంత్రి సతీశ్ జార్కిహెూళి అన్నారు. అందులో అర్థమేమిటి. ఇన్ని అంశాలు వెలుగులోకి వచ్చినా ఈడీ మౌనంగా ఎందుకు ఉన్నదని ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఎవరు రక్షిస్తున్నారు? అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

# కేటీఆర్ చేసినన్నీ తప్పులు ఎవరూ చేయలేదు

- **జన్వాడ ఫామ్‌హౌస్ కూలగొట్టడానికి రేవంత్‌కు భయమెందుకు**
- **బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు**



**బలగం టీవి, హైదరాబాద్**

పురపాలక మంత్రిగా కేటీఆర్ చేసినన్నీ తప్పులు ఎవరూ చేయలేదని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. చెరువులు ఎక్కడ కబ్జా చేశారో పదేళ్లు అధికారంలో ఉన్న కేటీఆర్‌కు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్‌ను కూలగొట్టాలని 2014లోనే హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన గుర్తుచేశారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎన్ కన్వెన్షన్‌ను ఎందుకు కూలగొట్టలేదని ప్రశ్నించారు.సినీ హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను కూలగొట్టాలని 2014లోనే హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన గుర్తుచేశారు.

కేటీఆర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు వారి బాధ్యతలు మర్చిపోయి మాట్లాడుతున్నారని రఘునందన్‌రావు పేర్కొన్నారు. పార్టీలనే తేడా లేకుండా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చాలనీ 2010 లోనే హై కోర్టు తీర్పు ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. కొత్తగా రేవంత్ రెడ్డి వచ్చి ఏదో చేసినట్టు ఒక డ్రామా నడిపిస్తున్నారని, రేవంత్ రెడ్డికి, హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే హైకోర్టు గుర్తించిన రెండు వేల ఐదు వందల చెరువులు కాపాడాలని పేర్కొన్నారు.

మీరాళం ట్యాంక్ ఉందా? అని రఘునందన్‌రావు ప్రశ్నించారు. అక్కడి ఎంఐఎం వాళ్లకి, కార్పొరేటర్లకు భయపడి హైడ్రా వెనక్కి తగ్గిందన్నారు. ఆంధ్ర వారు అనేక కబ్జాలు చేశారని, వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. 2014 లోనే ఎన్ కన్వెన్షన్ కూలగొట్టలని హై కోర్టు తీర్పు ఇచ్చిందని, 2014 నుంచి ఈ కన్వెన్షన్ పై వచ్చిన ఆదాయాన్ని హీరో నుంచి ముక్కు పిండి వసూలు చేయాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ పదేళ్లు మున్సిపల్ మంత్రిగా పని చేశారని, ఆయన తీసుకున్న చర్యలు ఎంటని రఘునందన్‌రావు నిలదీశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లు లేవా?, హరీశ్, కవిత, కేటీఆర్‌కు 111 జీవో పరిధిలో ఆస్తులు లేవా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని ఎందుకు కాపాడుతున్నారని, ముందు ముగ్గురు ఇల్లు కులగొట్టాలని డిమాండ్ చేశారు. జన్వాడ ఫామ్‌హౌస్ కూలగొట్టడానికి రేవంత్‌కు భయమెందుకని నిలదీశారు.

# ఎమ్మెల్యే పల్లాకు కోర్టులో ఊరట



**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి కేసులు పెడుతోందంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు..చెరువు శిఖం భూమిలో అనురాగ్ కాలేజీ నిర్మించారంటూ ఆయనపై కేసు నమోదు కాగా.. దీన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. నిబంధల ప్రకారం నడుచుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

హైకోర్టులో వాదనలకు ముందు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తనను, అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన మండిపడ్డారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ఎంత కక్షపూరితంగా వ్యవహరించినా తాను మాత్రం చట్ట ప్రకారమే నడుచుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.."అనురాగ్ యూనివర్సిటీ నిర్మాణానికి చట్ట ప్రకారం అన్నీ అనుమతులు తెచ్చుకున్నా. ఆగస్టు 22, 2024న ఇరిగేషన్ ఇంజినీర్ మా విశ్వవిద్యాలయాన్ని పరిశీలించారు. మరుసటి రోజు గాయత్రి ట్రస్ట్, అనురాగ్ సంస్థలు నాదం చెరువు బఫర్ జోన్‌లో ఉన్నాయంటూ ఫిర్యాదు చేశారు. పోలీసులు మమ్మల్ని కనీస సమాచారం అడగకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

గాయత్రి ట్రస్ట్, అనురాగ్ సంస్థలు గత 25ఏళ్లల్లో అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపట్టలేదు. గతంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కలిసి పరిశీలించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో లేవంటూ ఎన్‌వోసీ ఇచ్చారు. 2018లో అప్పటి మేడ్చల్ కలెక్టర్ జిల్లాస్థాయి కమిటీ వేసి పరిశీలించిన తర్వాతే ఎన్‌వోసీ ఇచ్చారు. ఇరిగేషన్, రెవెన్యూ, ఫైర్ డిపార్ట్మెంట్, ఎయిర్‌పోర్ట్ అథారిటీలు అన్నీ ఎన్‌వోసీలు ఇచ్చాయి. అప్పటి హెచ్ఎండీఏ కమిషనర్ అన్ని శాఖల అనుమతులు పరిశీలించిన తర్వాతే భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు.అయినా కాంగ్రెస్ ప్రభుత్వం నాపై, నా సంస్థలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. జనగామలో వ్యక్తిగతంగా నాపై నాలుగు కేసులు, హైదరాబాద్‌లో రెండు కేసులు పెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అనురాగ్ యూనివర్సిటీపై అన్ని శాఖలతో నిత్యం సోదాలు చేయిస్తున్నారు. ఏమీ దొరక్కపోవడంతో 2017లో అనుమతులు ఇచ్చిన ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చి నాపై మరో కేసు నమోదు చేయించారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎంత వేధించినా చట్ట పరిధిలో న్యాయం కోసం పోరాటం చేస్తా" అని చెప్పారు.



# హైదరాబాద్‌కు వస్తుండగా పుణేలో కూలిన హెలికాప్టర్..!

**బలగం టీవి, హైదరాబాద్**

మహారాష్ట్రలో పుణే జిల్లా పౌరీ ప్రాంతంలో శనివారం హెలికాప్టర్ కూలిపోయింది. ముంబయి నుంచి హైదరాబాద్‌కు వస్తున్న సమయంలో హెలికాప్టర్ కూలింది. ఇందుకు కారణాలు తెలియరాలేదు. ప్రతికూల వాతావరణం, సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమని తెలిసింది. ప్రమాదం జరిగిన సమయంలో హెలికాప్టర్ ముంబయి నుంచి హైదరాబాద్‌కు వస్తున్నది. ఈ హెలికాప్టర్‌లో నలుగురు వ్యక్తులు ఉన్నారు. ఇందులో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదాన్ని పూణే రూరల్ ఎస్పీ పంకజ్ దేశ్‌ముఖ్ ధ్రువీకరించారు. గాయపడిన కెప్టెన్ ఆనంద్‌ను సమీపంలోని ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు. భాటియా, అమర్‌దీప్ సింగ్, ఎస్పీ రామ్‌ల పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు.



## జిట్టాను పరామర్శించిన మంత్రి కోమటిరెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి గత కొన్ని రోజులుగా తీవ్ర అస్వస్థతతో సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, అనారోగ్యంతో బాధపడుతున్న బాలకృష్ణారెడ్డిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరామర్శించారు. బాలకృష్ణారెడ్డికి అందుతున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి మీరంతా ధైర్యంగా ఉండాలని, జిట్టా కోలుకుంటున్నారని డాక్టర్లు చెప్పినట్లు వారికి తెలిపారు.

## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై కేసు

**బలగం టీవి, హైదరాబాద్**

జనగామ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్ రెడ్డిపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ రెవెన్యూ పరిధిలోని నాదం చెరువు బఫర్ జోన్‌లో 1.5 ఎకరాల భూమిని పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆక్రమించారని ఆరోపణలు ఉన్నాయి. ఆ స్థలంలో అనురాగ్ ఇన్‌స్టిట్యూషన్స్ సంస్థ అక్రమ నిర్మాణాలు చేపట్టిందంటూ ఇరిగేషన్‌శాఖ ఏఈ పరమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో ఏఈ పేర్కొన్నారు. అయితే అనురాగ్ ఇన్‌స్టిట్యూషన్స్ సంస్థ ఛైర్మన్‌గా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డిపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

## కూల్చివేతలు ఆపాలి

**బలగం టీవి, హైదరాబాద్**

మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హీరో నాగార్జున తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో స్టే ఆర్డర్ ఉన్న కూడా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేశారంటూ నాగార్జున తరుపున న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలు ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 200 మంది పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు అక్రమంగా చేపట్టారని హైకోర్టు తెలిపింది.

## సెలవు కోసం తోటి విద్యార్థిని కొట్టి చంపిన పిల్లలు

**బలగం టీవి, హైదరాబాద్**

దేశ రాజధాని డిల్లీలోని మదర్సాలో తోటి విద్యార్థిపై ముగ్గురు విద్యార్థులు దాడి చేసి కొట్టిచంపారు. 9 నుంచి 11 సంవత్సరాలలోపు ఈ ముగ్గురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. స్కూల్‌కు సెలవు దినం ప్రకటించాలనే ఆలోచనతో మరీ చిన్నవాడైన విద్యార్థిని ఎంచుకుని కొట్టి చంపేసినట్లు విచారణ క్రమంలో వెల్లడైంది. మృతుడైన బాలుడి కడుపులోపల తీవ్రగాయాలు అయినట్లు గుర్తించారు, కడుపు కాలేయం బాగా దెబ్బతింది. లోపల బాగా రక్త స్రావం కావడం, కుడి ఊపిరితిత్తి దెబ్బతినడంతో బాలుడు మృతి చెందినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. అయితే తమతో తగవు పడి, తిట్టకు దిగడంతో కొట్టామని ఓ బాలుడు తెలిపాడు. శుక్రవారం ఈ బాలుడి విషాదాంతం జరిగింది. తీవ్ర గాయాలతో ఇంటికి చేరుకుని పడిపోయి ఉన్న బాలుడిని గుర్తించి తల్లి సమీపంలోని ఆసుపత్రికి తీసుకువెళ్లగా అంతర్గత గాయాలతో చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.ఈ ఘటనపై కేసు దర్యాప్తు సాగుతోందని అధికారులు తెలిపారు.

## 41కి చేరిన మృతుల సంఖ్య

**బలగం టీవి, హైదరాబాద్**

నేపాల్‌లో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య 41 కి చేరింది. దాదాపు 43 మంది ప్రయాణికులతో నేపాల్ లోని పొఖారా నుంచి కాఠ్మండ్‌కు శుక్రవారం ఈ బస్సు బయలుదేరింది. రోడ్డుపై అదుపు తప్పి 150 అడుగుల లోతులో ప్రవహిస్తున్న మార్స్యయాంగడి నదిలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో మొత్తం 41 మంది చనిపోయారని ,ప్రయాణికులు ఎంతమందో ఇంకా కచ్చితంగా తెలియవలసి ఉందని, 12 మందిని ఆస్పత్రికి నేపాల్ ఆర్మీ తరలించారని మహారాష్ట్ర మంత్రి మహాజన్ చెప్పారు.

ఢిల్లీ లోని దౌత్య కార్యాలయంతో తాము సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. ప్రయాణికుల్లో చాలా మంది మహారాష్ట్ర లోని జలగావ్ జిల్లాకు చెందిన వారు. ప్రయాణికులు ఇంకా మరో 16 నుంచి 18 వరకు ఎక్కువ ఉండవచ్చని వారు చనిపోయి ఉండవచ్చని చెప్పారు. అంతకు ముందు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా, ఇతర సీనియర్ కేంద్ర అధికారులతో మృతదేహాలను స్వదేశానికి రప్పించే ఏర్పాట్లుపై చర్చించారు. నేపాల్ నుంచి నాసిక్‌కు ఆదివారం ప్రత్యేక విమానం ద్వారా 24 మృతదేహాలు వస్తాయని కుటుంబీకులకు వాటిని అప్పగిస్తారని తెలుస్తోంది.

# వక్ఫ్‌బోర్డ్ చట్టంలో మార్పులు అభ్యంతరకరం



- **సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘ వులు**

**బలగం టీవి, హైదరాబాద్**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించి మార్పులు చేయాలనుకోవడం అభ్యంతరకరమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘ వులు అన్నారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాననే స్పృహ లేకుండా ప్రధాని మోడీ దూకుడుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మతతత్వ ఆలోచనలను విడిచిపెట్టకుండా కొనసాగిస్తున్నారని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటలో జాతినుద్దేశించి ప్రసంగించడమే అందుకు నిదర్శనమన్నారు. శుక్రవారం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం, శనివారం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక మతంలో ఇంకో మతస్తులుండొద్దంటూ బీజేపీ నేతలు చెప్తారని గుర్తు చేశారు. వక్ఫ్‌బోర్డులో మాత్రం ఇతర మతస్తులను చేర్చి నియంత్రించాలని చెప్తున్నారని అన్నారు. ఈ ద్వంద్వ ప్రమాణాలేంటని ప్రశ్నించారు. దయాదాక్షిణ్యాలతో ఇచ్చిన భూములను నియంత్రించడమే వక్ఫ్‌బోర్డు పని అని చెప్పారు. వాటి మీద ప్రభుత్వం నియంత్రించడానికి పూనుకోవడం న్యాయం కాదన్నారు. అవినీతిపై ఫిర్యాదులు వస్తే ప్రభుత్వం స్పందిస్తే బాగుంటుందని అన్నారు. హర్యానా, జమ్మూకాశ్మీర్, మహారాష్ట్ర, జార్ఖండ్‌లో ఎన్నికలు జరుగుతున్నాయనీ, దుర్బుద్ధితో మత విభజనను సృష్టించి ఓట్లు పొందాలని బీజేపీ చూస్తున్నదని విమర్శించారు. యూనిఫామ్ సివిల్ కోడ్, కామన్ సివిల్ కోడ్‌లో లోపాలుంటే సవరించుకోవచ్చనీ, దాన్ని కమ్యూనల్ సివిల్ కోడ్‌గా మారుపేరు పెట్టారని ప్రధాని మోదీ మత దురభిప్రాయాన్ని రెచ్చగొడుతున్నారని రాఘవులు చెప్పారు.

కింది స్థాయి వ్యక్తులు వ్యాఖ్యలు అర్థం చేసుకోవచ్చనీ, ఇది ప్రధాని హెూదాకు తగదని అన్నారు. దేశాన్ని ఐక్యంగా ఉంచాల్సిన వ్యక్తి చీలిక తెస్తున్నారని విమర్శించారు. యూనిఫామ్ సివిల్ కోడ్‌ను మారుస్తామంటున్నారని, ఉత్తరాఖండ్‌లో మార్చారనీ, అనేక పరిణామాలు జరిగాయని వివరించారు. అన్ని మతాల్లో పురుషాధిక్యత కొనసాగుతున్నదనీ, దాన్ని తగ్గించాలని కోరారు. వివిధ మతాల్లో మహిళలకు సమాన అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే మహిళలు, మైనార్టీలకు మేలు జరగబోదని అన్నారు. స్వార్థపూరిత, ఓట్ల రాజకీయాల కోసం వాడుకోవడాన్ని తీవ్రంగా వ్యవరేకిస్తున్నామని చెప్పారు.

# ప్రతి సలహా, సూచన ప్రభుత్వానికి నివేదిస్తాం..




- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

నూతన ఆర్ఓఆర్ చట్టం 2024 ముసాయిదాపై చర్చ వేదికలో ప్రతి ఒక్కరూ ఇచ్చిన సలహాలు, సూచనలు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. నూతన ఆర్ఓఆర్ చట్టం 2024 ముసాయిదాపై శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో చర్చ వేదిక కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన నిర్వహించారు. ఈ చర్చకు జిల్లాలోని రైతులు, రైతు సంఘం నాయకులు, రెవెన్యూ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ అందరి సలహాలు, సూచనల పై ఒక నివేదిక తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని అన్నారు. అనంతరం సిరిసిల్ల ఆర్డీవో నూతన ఆర్ ఓ ఆర్ చట్టం 2024 ముసాయిదాలోని ప్రతి అంశాన్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు నిపుణులతో కమిటీ వేసిందని, దాదాపు 18 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, ఆరు నెలల్లోనే ఈ ముసాయిదాను తయారు చేసిందని తెలిపారు. భూ సమస్యలు రాకూడదనే ఉద్దేశ్యంతో చట్టం చేయనుందని పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే ఆన్లైన్లో సలహాలు, సూచనలు స్వీకరించిదని,చట్టం అందరికీ ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఇప్పుడు నేరుగా స్వీకరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి జిల్లాలో రెవెన్యూ కోర్టు ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామానికి వీఆర్ఓ, వీఆర్ఏలను నియమించాలని, ప్రతి ఏడాది భూమికి సంబంధించి కనీస రుసుం వసూలు చేయాలని, ప్రతి సంవత్సరం పహాని తయారు చేయాలని, గ్రామంలోని ప్రభుత్వ భూముల వివరాలు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉండేలా చూడాలని, అన్ని భూములను రీ సర్వే చేయాలని, ధరణిలో ఎదురైన సమస్యలను పరిష్కరించాలని,ప్రోహిబిటెడ్ భూముల విషయంలో నిర్ణయం తీసుకోవాలని చర్చ వేదికకు వచ్చిన రైతులు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్ హాజరయ్యారుఇక్కడ తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


# ఫ్యాక్టరీలో బాయిలర్ పేలుడు..



**బలగం టీవీ , ముంబై**

ఒక ఫ్యాక్టరీలో బాయిలర్ పేలింది. ఈ ప్రమాదంలో 22 మంది కార్మికులు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ముగ్గురు కార్మికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మహారాష్ట్రలోని జల్నాలో ఈ సంఘటన జరిగింది. శనివారం మధ్యాహ్నం ఎంఐడీసీ ప్రాంతంలోని ఉక్కు కర్మాగారంలో బాయిలర్ పేలింది. గజ్‌కేసరి స్టీల్ మిల్లులో ఈ సంఘటన జరిగింది. బాయిలర్ పేలుడు వల్ల కరిగిన ఇనుము కార్మికులపై పడిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో 22 మంది కార్మికులు గాయపడినట్లు చెప్పారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు వివరించారు.

కాగా, గాయపడిన కార్మికుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నదని పోలీసులు తెలిపారు. ఛత్రపతి శంభాజీ నగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో వారికి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ఐరన్ స్క్రాప్ నుంచి స్టీల్ కడ్డీలను ఈ ఫ్యాక్టరీలో తయారు చేస్తారని వివరించారు. గాయపడిన కార్మికుల వాంగ్మూలాలను నమోదు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.




## దేశంలో తొలి ఎంపాక్స్ ఆర్టీ-పీసీఆర్ కిట్ తయారీ..

**బలగం టీవీ , న్యూఢిల్లీ**

విశాఖ మెడ్‌టెక్ జోన్ మరో ఘనత నమోదు చేసింది. కరోనా సమయంలో ఆరోగ్య రంగానికి అవసరమైన అనేక దేశీయ ఉత్పత్తులను అందించిన విశాఖ మెడ్‌టెక్ జోన్ తాజాగా మంకీపాక్స్ నిర్ధారణ కోసం దేశీయంగా తయారైన తొలి మంకీ పాక్స్ ఆర్టీ పీసీఆర్ కిట్‌ను ఉత్పత్తి చేసింది.

మెడ్‌టెక్ జోన్ భాగస్వామి ట్రాన్సాసియా డయాగ్నోస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎర్బామ్ డీఎక్స్ మంకీ పాక్స్ కెకె ఆర్టీ-పాక్స్ పేరిట కిట్ రూపకల్పన చేసింది. ఈ కిట్‌కి ఐసీఎంఆర్, కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ అర్గనైజేషన్ నుంచి అత్యవసర అంగీకారం లభించింది. మెడ్‌టెక్ జోన్ సిఇఒ డాక్టర్ జితేంద్ర శర్మ మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య ఆవిష్కరణలలో భారతదేశం అగ్రగామిగా ఉందని ఈ ఆవిష్కరణ ప్రతిబింబిస్తోందన్నారు.

# పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ మేనిఫెస్టో విడుదల




**బలగం టీవీ , శ్రీనగర్**

జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) అధినేత్రి మెహబూబా ముఫ్తీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను శనివారం విడుదల చేశారు. ప్రజల ఆకాంక్షల పేరుతో పలు అంశాలను ప్రస్తావించారు. కూటమిగా ఏర్పడిన నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ పార్టీలు తమ పార్టీ ఎజెండాలను అనుసరిస్తే తాము పోటీకి దూరంగా ఉంటామని మెహబూబా ముఫ్తీ అన్నారు. అప్పుడు 90 స్థానాల్లో వారే పోటీ చేయాలని చెప్పారు. అయితే ఎన్సీ, కాంగ్రెస్ మధ్య పొత్తు ఏ ఎజెండా ఆధారంగా కాదని, కేవలం సీట్ల పంపకం ప్రాతిపదికన జరిగిందని ఆమె విమర్శించారు.

కాగా, పొత్తు, సీట్ల పంపకం చాలా దూరమైన విషయాలని మెహబూబా ముఫ్తీ అన్నారు. 'నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ మా ఎజెండాను స్వీకరించడానికి సిద్ధంగా ఉంటే, అన్ని స్థానాల్లో పోటీ చేయాలని మేం చెబుతాం. వారిని మేం అనుసరిస్తాం. ఎందుకంటే కశ్మీర్ సమస్య పరిష్కారం కంటే నాకు ఏదీ ముఖ్యం కాదు. ఇంతకు ముందు కూడా పొత్తు పెట్టుకున్నప్పుడు మాకు ఒక ఎజెండా ఉంది. బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పుడు వాళ్ల అంగీకరించిన ఎజెండా కూడా ఉంది' అని ఆమె అన్నారు. అయితే కేవలం సీట్ల పంపకంపై మాత్రమే చర్చలు జరిగితే తమ పార్టీ ఏ కూటమిలోనూ చేరదని ముఫ్తీ స్పష్టం చేశారు.మరోవైపు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) లోని హిందూ తీర్థయాత్ర స్థలమైన శారదా పీఠ్‌కు వెళ్లే మార్గాన్ని తెరువాలని తమ పార్టీ కోరుకుంటోందని మెహబూబా ముఫ్తీ తెలిపారు. అలాగే ఆర్టికల్ 370 రద్దు తర్వాత 2019 నుంచి నిలిపివేసిన సరిహద్దు వాణిజ్యాన్ని పునరుద్ధరించడం కోసం పాకిస్థాన్‌తో భారత్ చర్చలు జరుపాలని ఆమె అన్నారు.

# బాలికపై సామూహిక లైంగికదాడి చెరువులో దూకి ప్రధాన నిందితుడు మృతి



**బలగం టీవీ , అసోం**

అసోంలోబాలికపై లైంగికదాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన నిందితుడు చెరువులో దూకి మృతి చెదాడు. శనివారం తెల్లవారుజామున పోలీసులు క్రైమ్ సీన్ రిక్రియేషన్ చేస్తుండగా నిందితుడు చెరువులో దూకినట్లు పోలీసులు తెలిపారు. అతడి కోసం గాలించగా రెండు గంటల తరువాత మృతదేహం లభించిందని పోలీసులు ప్రకటించారు.

ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అనంతరం శనివారం తెల్లవారుజామున 3.30 గంటలకు పోలీసులు క్రైమ్ సీన్ రిక్రియేషన్ కోసం నేరం జరిగిన ప్రదేశానికి పోలీసలు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నిందితుడు పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకొని చెరువులోకి దూకాడు. వెంటనే అతడి కోసం వెతకగా, దాదాపు రెండు గంటల తర్వాత అతని మృతదేహం లభించిందని పోలీసులు తెలిపారు.

అసోంలోని నాగావ్ జిల్లాకు చెందిన 14 ఏళ్ల బాలిక ట్యూషన్ అనంతరం సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా, బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆమెను సమీపంలోని చెరువు వద్దకు లాక్కెళ్లారు. లైంగికదాడికి ఒడిగట్టి పారిపోయారు. గాయాలపాలై అపస్మారక స్థితిలో ఉన్న బాలికను స్థానికులు రక్షించారు. పోలీసులు బాలికను ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు వ్యక్తులు తనపై సామూహిక లైంగికదాడికి పాల్పడినట్లు ఆమె పోలీసులకు తెలపింది. ఈ ఘటనపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కేసులో ఒకరిని అరెస్టు చేశామనీ, మరొకరిని అదుపులోకి తీసుకున్నామని శుక్రవారం పోలీసులు ప్రకటించారు. ఇందులో ప్రధాన నిందితుడిని క్రైమ్ సీన్ రిక్రియేషన్ కోసం శనివారం తెల్లవారుజామున తీసుకెళ్లగా, ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు.

# ప్రభుత్వ వ్యవస్థకు దూరంగా 90 శాతం దేశ జనాభా



- **రాహుల్ గాంధీ**

**బలగం టీవీ , ప్రయాగరాజ్**

కులగణనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి గళం విప్పారు. దేశ జనాభాలో 90 శాతం మంది ఇప్పటికీ వ్యవస్థకు దూరంగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి తగిన స్థాయిలో భాగస్వామ్యం లభించాలంటే కులగణన తప్పనిసరని అన్నారు. దేశంలోని పారిశ్రామికవేత్తల్లో ఎస్సీ, ఎస్టీ, గిరిజన కమ్యూనిటీలకు ప్రాతినిధ్యం కొరవడిందని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్'లో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ, ప్రభుత్వ పాలనా వ్యవస్థకు దూరంగా ఉండిపోయిన 90 శాతం మంది ప్రజలకు తగిన నైపుణ్యం, ప్రతిభ ఉన్నప్పటికీ వారికి పాలనా వ్యవస్థలో భాగస్వాములయ్యే అవకాశం రావడం లేదన్నారు. అందువల్లే తాము కులగణన చేపట్టాలని బలంగా చెబుతున్నామని తెలిపారు. "మా వరకూ కులగణన అంటే అది కేవలం కులాల లెక్కలు కాదు. ప్రభుత్వ విధానాల రూపకల్పనకు పునాది. కులగణన చేసినంత మాత్రాన సరిపోదు. వివిధ కులాల మధ్య సంపద పంపిణీ ఎలా ఉందో అధ్యయనం చేయాలి. అదేవిధంగా బ్యూరోక్రసీ, జ్యుడిషియరీ, మీడియాలో ఓబీసీలు, దళితులు, కార్మికుల భాగస్వామ్యం ఎంతుందో కూడా తెలుసుకోవాలి" అని రాహుల్ అన్నారు. తాను 2004 నుంచి రాజకీయాల్లో ఉన్నానని, బీజేపీ తనకు రాజకీయ గురువుగా మారిందని, ఏమి చేయకూడదనేది ఆ పార్టీని చూసి నేర్చుకుంటున్నానని విసుర్లు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన జరుపుతుందని, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగిస్తుందని చెప్పారు. రాజకీయపరంగా నష్టం జరిగినా కులగణన జరిపించి తీరుతామని అన్నారు.

## ఎన్నికలు వాయిదా వేయాలి

- **ఈసీకి హర్యానా బీజేపీ లేఖ**

**బలగం టీవీ , హర్యానా**

షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 1న జరగాల్సిన హర్యానా అసెంబ్లీ ఎన్నికలను వాయిదా వేయాలని ఎన్నికల సంఘాన్ని రాష్ట్ర బీజేపీ విభాగం కోరింది. సుదీర్ఘ వారంతపు సెలవుల కారణంగా ఓటింగ్ శాతం తగ్గే అవకాశం ఉన్నందున పోలింగ్ తేదీని వాయిదా వేయాలని విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు ఈసీకి హర్యానా బీజేపీ చీఫ్ మోహన్‌లాల్ బడోలి ఈనెల 22న లేఖ రాశారు."28వ తేదీ శనివారం, 29వ తేదీ ఆదివారం వచ్చాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలకు ఒక వీక్లీ హాలిడే ఉంటుంది. అక్టోబర్ 1న పోలింగ్ రోజు కూడా చట్టప్రకారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు మూతపడతాయి. 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా నేషనల్ హాలిడే ఉంది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 2 వరకూ హాలిడేల పొడిగింపు వల్ల ఓటింగ్ శాతం తగ్గేందుకు అవకాశం ఉంది. వీటికి తోడు, హర్యానాలో గణనీయంగా ఓటర్లున్న బిష్ణోయ్ కమ్యూనిటీ వారు రాజస్థాన్లోని ముఖమ్ గ్రామంలో జరిగే వార్షిక యాత్రకు వెళ్తుంటారు. ఆ కారణంగా వారు అక్టోబర్ 1న పోలింగ్‌కు హాజరయ్యే అవకాశాలు ఉండకపోవచ్చు. ఈ కారణాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని గరిష్ఠంగా ఓటింగ్ శాతం జరిగేందుకు వీలుగా మరో తేదీన ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నాం. గతంలో కూడా ఓటింగ్ తేదీలను పండుగల కారణంగా వాయిదా వేసిన సందర్భాలు ఉన్నాయి" అని ఈసీకి రాసిన లేఖలో బడోలి కోరారు. కాగా, బీజేపీ హర్యానా విభాగం శుక్రవారం పంపిన ఈ-మెయిల్ తమకు అందిందని, ఎన్నికల కమిషన్‌కు దానిని పంపామని రాష్ట్ర ఎన్నికల అధికారి పంకజ్ అగర్వాల్ ధ్రువీకరించారు.

**ఓటమి భయంతోనే: కాంగ్రెస్**

కాగా, ఎన్నికలు వాయిదా కోసం బీజేపీ చెప్పిన కారణాల్లో ఏమాత్రం పసలేదని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. బీజేపీకి ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుందని కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా తెలిపారు.



# ఆరుగురు మహిళా కమిషన్ సభ్యులకు నోటీసులు

**బలగం టీవీ , హైదరాబాద్**

ఆరుగురు మహిళా కమిషన్ సభ్యులకు నోటీసులు జారీ చేయాలని ప్యానెల్ సెక్రటరీకి కమిషన్ ఛైర్మన్ నేరేళ్ల శారద ఆదేశించారు. మహిళా కమిషన్ ఎదుట హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కమిషన్ కార్యాలయంలో రాఖీ కట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే అక్కడి ప్రాంగణంలో మొబైల్ ఫోన్స్‌కు పర్మిషన్ లేకపోయినా కూడా సీక్రెట్‌గా మొబైల్ ఫోన్ తీసుకెళ్లి రాఖీ కట్టిన వీడియోలు చిత్రీకరించడంపై సీరియస్ అయ్యారు. కమిషన్ విశ్వసనీయతను దెబ్బతీసేలా ప్రవర్తించారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.ఇందులో ప్రమేయం ఉన్న సభ్యులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని, వారిపై క్రమశిక్షణ చర్యలను ప్రారంభించాలని కమిషన్ కార్యదర్శిని ఆదేశించినట్లు చైర్ పర్సన్ తెలిపారు. మహిళా కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, నిబద్ధత విషయంలో రాజీపడే వైఖరిని సహించేది లేదన్నారు.

# బంగ్లాదేశ్‌కు భారీ ఆధిక్యం !



**బలగం టీవి, హైదరాబాద్**

పాకిస్థాన్ -బంగ్లాదేశ్ మధ్య రావల్పిండి వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 117 పరుగుల భారీ ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై ఇరు జట్ల ఆటగాళ్లు సత్తా చాటారు. 316/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన బంగ్లాదేశ్ 565 పరుగులకు ఆలౌటైంది. ఈ మ్యాచ్ లో ముష్ఫికర్ రహీమ్ (191) తృటిలో డబుల్ సెంచరీ చేజార్చుకోగా.. లిటన్ దాస్ (56), మెహ్‌దీ హసన్ మీరాజ్ (77) హాఫ్ సెంచరీలతో రాణించారు. పాకిస్థాన్ బౌలర్లలో షాహీన్ షా అఫ్రిది, ఖుర్రమ్ షెహ్‌జాద్, మహమ్మద్ అలీ రెండేసి వికెట్లు తీయగా.. నసీమ్ షా మూడు వికెట్లు పడగొట్టాడు. సయీమ్ ఆయుబ్ ఓ వికెట్ తీసాడు.

తరువాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్థాన్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టానికి 23 పరుగులు చేసింది. పాకిస్థాన్ ఇంకా 94 పరుగుల వెనుకంజలో ఉంది. క్రీజులో కెప్టెన్ షాన్ మసూద్(9 బ్యాటింగ్), ఆబ్దుల్లా షఫీక్(12 బ్యాటింగ్) ఉన్నారు.

**సంక్షిప్త స్కోర్లు:**
**పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్ 448/6 డిక్లేర్డ్**
**బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ 565 ఆలౌట్**
**పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్ 23/1**

# తొలి టీ20 విండీస్‌దే

**బలగం టీవి, హైదరాబాద్**

సొంతగడ్డపై దక్షిణాఫ్రికా చేతిలో టెస్టు సిరీస్ కోల్పోయిన వెస్టిండీస్ టీ20 సిరీస్‌లో విజృంభించింది. బ్రియాన్ లారా స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో నికోలస్ పూరన్ (65 నాటౌట్ ) విధ్వంసంతో విండీస్ భారీ విజయం సాధించింది. సఫారీలు నిర్దేశించిన 175 పరుగుల ఛేదనలో పూరన్ రెచ్చిపోయాడు. సిక్సర్ల వర్షంతో ప్రొటిస్ బౌలర్లను ఉతికేసి జట్టును గెలిపించాడు. దాంతో, 7 వికెట్ల తేడాతో గెలుపొందిన వెస్టిండీస్ సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది.

ట్రినిడాడ్‌లోని బ్రియాన్ లారా స్టేడియంలో మొదట ఆడిన దక్షిణాఫ్రికా 174 రన్స్ కొట్టింది. యువకెరటం ట్రిస్టన్ స్టబ్స్(76) హాఫ్ సెంచరీకి తోడు లోయర్ ఆర్డర్‌లో ప్యాట్రిక్ క్రుగెర్(44) దంచడంతో పర్యాటకు జట్టు భారీ టార్గెట్ నిర్దేశించింది. ఛేదనలో విండీస్‌కు శుభారంభం దక్కింది. ఓపెనర్ అలిక్ అథనజె(40), షా హెూప్(51)లు దూకుడుగా ఆడి తొలి వికెట్‌కు 84 పరుగులు జోడించారు.ఈ ఇద్దరిని బార్ట్‌మన్ వెనక్కి పంపాక



వచ్చిన నికోలస్ పూరన్(65 నాటౌట్ 26 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సర్లు) సిక్సర్లతో హెూరెత్తించాడు. నంద్రె బర్గర్ ఓవర్లో వరుసగా 4 సిక్సర్లు బాదిన పూరన్ అర్ధ శతకంతో జట్టును గెలిపించాడు. ఇరుజట్ల మధ్య రెండో టీ20 ఇదే స్టేడియంలో ఆగస్టు 26న జరుగనుంది

# క్రికెట్‌కు గబ్బర్ గుడ్ బై

- **రిటైర్మెంట్ ప్రకటించిన శిఖర్ ధావన్**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ టీమ్ ఇండియా క్రికెటర్ శిఖర్ ధావన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. ఇంటర్?నేషనల్?, డొమెస్టిక్? క్రికెట్? నుంచి రిటైర్మెంట్?? ప్రకటించాడు. ఈ మేరకు ఓ ఎమోషనల్? వీడియో విడుదల చేశాడు. శిఖర్ ధావన్ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు క్రికెట్ ఫ్యాన్స్?లో షాకింగ్?గా మారింది. కాగా, కొంత కాలంగా శిఖర్ ధావన్ అంతర్జాతీయ క్రికెట్?కు వీడ్కోలు పలుకుతాడనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే అతడు ఈ నిర్ణయాన్ని ప్రకటించాడు.

"ఇండియా కోసం ఆడాలనే ఎంతో కష్టపడ్డాను, తపించాను. అది జరిగింది. ఈ ప్రయాణంలో నాకు ఎంతో మంది అండగా నిలిచారు. నాకు కుటుంబం, చిన్ననాటి కోచ్ ఇంకా పలువురి వల్ల ఈ స్థాయికి వచ్చాను. దేశం తరపున ఆడినందుకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉంది. ఇప్పుడు నేను ఇంటర్ నేషనల్, డొమెస్టిక్ క్రికెట్ నుంచి రిటైర్‌మెంట్ ప్రకటిస్తాను. నా క్రికెట్ ప్రయాణంలో ఈ అధ్యాయాన్ని ముగిస్తున్నాను. లెక్కలేనన్ని మధుర జ్ఞాపకాలను, కృతజ్ఞతా భావాన్ని నా వెంట తీసుకువెళ్తున్నాను. నాకు అవకాశాలు ఇచ్చిన బీసీసీఐ, అలాగే నాకు ప్రేమను పంచి అండగా నిలిచిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు. జై హింద్?!" అని వీడియోలో శిఖర్ ధావన్ పేర్కొన్నాడు.




టీమ్ ఇండియా ఓపెనర్‌గా, ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. దాదాపుగా ప్రతీ ఐసీసీ టోర్నమెంట్‌లోనూ శిఖర్ ధావన్ తనదైన ముద్ర వేశాడు. అయితే కొంత కాలంగా శిఖర్ ధావన్‌కు టీమ్ సెలక్షన్‌లో తగిన ప్రాధాన్యత దక్కడం లేదు. ఫామ్ విషయంలోనూ అతడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అలా అతడి వయసు కూడా పెరుగుతుండటంతో శిఖర్ ధావన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇకపోతే శిఖర్ ధావన్ క్రికెట్ కెరీర్‌లోనే కాకుండా వ్యక్తిగత జీవితంలోనూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాడు.

శిఖర్ ధావన్ తన కెరీర్?లో 167 వన్డేలు, 34 టెస్టులు, 68 టీ20లు ఆడాడు. 167 వన్డేల్లో 6,793 పరుగులు చేశాడు. 34 టెస్టుల్లో 2,315 పరుగులు, 68 టీ20ల్లో 1,759 పరుగులు సాధించాడు. ఇక వన్డేల్లో 17, టెస్టుల్లో 7 శతకాలు నమోదు చేశాడు గబ్బర్. ఇండియా తరపున శిఖర్ ధావన్ చివరిసారి డిసెంబర్ 2022లో బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ఆడాడు.

# రిటైర్మెంట్ వార్తలను ఖండించిన కేఎల్ రాహుల్

- **ఆ ఎపిసోడ్ నన్ను భయపెట్టింది : రాహుల్**

కాఫీ విత్ కరణ్' ఎపిసోడ్ నన్ను భయపెట్టింది.. తొలిసారి సస్పెండ్ అయ్యాను అని భారత జట్టు స్టార్ ఆటగాడు కేఎల్ రాహుల్ అన్నారు. 2019లో పెద్ద దుమారం రేపిన 'కాఫీ విత్ కరణ్' షో గురించి పలు ఆసక్తికర విషయాలు చెప్పాడు. హార్దిక్ పాండ్యాతో కలిసి తాను పాల్గొన్న ఎపిసోడ్ తనను ఎంతో భయపెట్టిందని రాహుల్ అన్నాడు.



భారత జట్టు స్టార్ ఆటగాడు కేఎల్ రాహుల్ వీడ్కోలు వార్తలను ఖండించాడు. తన పేరిట ఇన్‌స్టాగ్రామ్‌లో వెలిసిన రిటైర్మెంట్ పోస్ట్ అంతా ఫేక్ అని తేల్చేశాడు. తాజాగా రాహుల్ 2019లో పెద్ద దుమారం రేపిన 'కాఫీ విత్ కరణ్' షో గురించి పలు ఆసక్తికర విషయాలు చెప్పాడు. హార్దిక్ పాండ్యాతో కలిసి తాను పాల్గొన్న ఎపిసోడ్ తనను ఎంతో భయపెట్టిందని రాహుల్ అన్నాడు. నిఖిల్ కామత్ అనే యూట్యూబర్‌తో మాట్లాడిన రాహుల్.. ఆ ఇంటర్వ్యూ తనను ఎంతో మార్చేసిందని తెలిపాడు.

'భారత్‌కు ఆడినప్పుడు నేను ఎంతో ఆత్మవిశ్వాసంగా ఉండేవాడిని. కానీ, కాఫీ విత్ కరణ్ ఇంటర్వ్యూతో నాపై చాలా ప్రభావమే పడింది. నా జీవితంలో నేను ఎప్పుడూ సస్పెండ్ కాలేదు. స్కూల్ రోజుల్లోనూ నాపై ఏ రిమార్క్ లేదు. అలాంటిది ఆ ఇంటర్వ్యూ నన్ను ఎంతో భయపెట్టింది. ఆ ఎపిసోడ్ కారణంగా నేను జట్టులో స్థానం కోల్పోయా. అయితే.. అంతకుముందు నేను ట్రోలింగ్‌ను పాజిటివ్ గానే తీసుకునేవాడిని. అప్పుడు నేను చాలా యంగ్. కానీ, రెండేండ్ల తర్వాత నేను చాలా ట్రోలింగ్‌కు గురయ్యా. కూర్చున్నా, నిల్చొన్నా అదే పనిగా ట్రోల్ చేసేవాళ్లు' అని రాహుల్ తెలిపాడు. శ్రీలంక పర్యటనలో విఫలమైన ఈ స్టార్ ఆటగాడు దేశవాళీలో చెలరేగేందుకు సిద్ధమవుతున్నాడు.



## నా బయోపిక్‌లో వాళ్లు నటిస్తే సంతోషిస్తా.. : ధావన్

**బలగం టీవీ, హైదరాబాద్**



ఆటకు గుడ్ బై చెప్పిన ధావన్ తన బయోపిక్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తన జీవితాన్ని చక్కని సినిమాగా తెరకెక్కిస్తే చాలా సంతోషిస్తానని అన్నాడు. ఒకవేళ బయోపిక్‌లో అవసరమైతే తాను నటించేందుకు సిద్ధమే. అలాకాకుంటే బాలీవుడ్ హీరోలు అక్షయ్ కుమార్ లేదా రణ్‌వీర్ సింగ్ లలో ఎవరో ఒకరు నటిస్తే బాగుంటుంది అని ధావన్ వెల్లడించాడు. 'నా జీవిత కథలో అక్షయ్ కుమార్ నటిస్తే నేను ఆనందిస్తా. ఒకవేళ రణ్‌వీర్ సింగ్ అయినా పర్లేదు. ఎందుకంటే అతడి ఎనర్జీ మామూలుగా ఉండదు' అని ధావన్ తెలిపాడు. అంతేకాదు వీడ్కోలు తర్వాత తన పాపులారిటీ తగ్గుందని అనుకోవడం లేదని ధావన్ చెప్పాడు. 'రిటైర్మెంట్ అనంతరం నాకు ఫాలోయింగ్ తగ్గుతుందని ఎవరు చెప్పారు? ఏమో ఎవరికి తెలుసు నా పాపులారిటీ మరింత పెరగొచ్చు. నేను అభిమానుల గుండెల్లో ఉన్నాను. కొన్నిసార్లు క్రికెట్ ద్వారా మరికొన్ని సార్లు నా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా ఫ్యాన్స్ మదిలో స్థానం సంపాదించా. అందుకని జనాలు నాపై చూపించే ప్రేమ ఇకపై పెరుగుతుందని భావిస్తున్నా' అని ధావన్ చెప్పుకొచ్చాడు.

## ఆస్పత్రి నుంచి హీరో రవితేజ డిశ్చార్జ్

**బలగం టీవీ, హైదరాబాద్**




గాయం కారణంగా ఆస్పత్రిలో ట్రీట్మెంట్ తీసుకుంటున్న టాలీవుడ్ నటుడు రవితేజ తాజాగా డిశ్చార్జ్ అయ్యారు. ఈ విషయాన్ని అభిమానులను తెలియజేసేందుకు ఆయన తాజాగా ఎక్స్‌లో పోస్ట్ చేశారు."ప్రస్తుతం నేను ఆరోగ్యంగానే ఉన్నాను. నా క్షేమాన్ని ఆకాంక్షిస్తూ మెసేజ్‌లు పంపిన వారందరికీ ధన్యవాదాలు. త్వరలోనే నేను మళ్లీ షూటింగ్‌లోకి అడుగుపెట్టేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అంటూ పోస్ట్ చేశారు. ఇక ఈ ట్వీట్ చూసి ఫ్యాన్స్ 'గెట్ వెల్ సూన్ అన్న' అంటూ కామెంట్లు పెడుతున్నారు.

## అర్షద్ హుందాగా మాట్లాడాల్సింది

- **దర్శకుడు నాగ్ అశ్విన్**

**బలగం టీవీ, హైదరాబాద్**



'కల్కి 2898 ఏడీ' సినిమాను ఉద్దేశించి ప్రభాస్ లుక్ జోకర్‌లా ఉందని బాలీవుడ్ ప్రముఖ నటుడు అర్షద్ వార్సి కామెంట్స్ చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయం పెద్ద ఎత్తున వివాదస్పదమైంది. టాలీవుడ్‌లోని చాలా మంది దర్శకనిర్మాతలు, నటులు అర్షద్‌పై విమర్శలు గుప్పించారు. అయితే ఇప్పుడు ఈ విషయంపై తాజాగా కల్కి 2898 ఏడీ దర్శకుడు నాగ్ అశ్విన్ కూడా స్పందించారు. భాష ఆధారంగా సినిమాను వేరు చేసి చూడొద్దని అన్నారు.

"నార్త్ – సౌత్, టాలీవుడ్ వెర్సస్ బాలీవుడ్ అంటూ పోల్చి వెనక్కి వెళ్లొద్దు. అందరం ఒక పరిశ్రమకే చెందిన వాళ్లం. అర్షద్ ఇంకాస్త హుందాగా మాట్లాడాల్సింది. అయినా పర్వాలేదు. మేము ఆయన పిల్లల కోసం 'కల్కి' బుజ్జి బొమ్మలను పంపిస్తాం. కల్కి సెకండ్ పార్ట్ కోసం మరింత కష్టపడి పని చేస్తాను. అందులో ప్రభాస్‌ను మరింత బెస్ట్‌గా చూపిస్తాను" అని చెప్పుకొచ్చారు. "ఈ ప్రపంచంలో చాలా మంది మనల్ని ద్వేషిస్తారు. కానీ మనం వాటిని పట్టించుకోకూడదు. ముందుకెళ్లిపోవాలి" అని నాగ్‌అశ్విన్ చెప్పారు. ప్రభాస్ కూడా ఇదే మాట తనతో అంటుంటారని గుర్తు చేసుకున్నారు.

## 'సరిపోదా శనివారం సెన్సార్ పూర్తి

**బలగం టీవీ, హైదరాబాద్**

నాని కథానాయకుడిగా వస్తున్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం'.వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తుండగా.. నాని సరసన ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తుంది. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. తాజా గా ఈ చిత్రం సెన్సార్ పనులు పూర్తి చేసుకు న్నట్టు నాని సోషల్ మీడియా వేదికగా ప్రకటిం చాడు. ఈ సందర్భంగా ఒక వీడియోను కూడా వదిలాడు. 'సరిపోదా శనివారం' సెన్సార్ కంప్లీట్ అయ్యింది. సెన్సార్ బోర్డ్ U/A సర్టిఫికెట్ ఇచ్చింది. అలాగే 2 గంటల 35 నిమిషాలు రన్ టైం అని నాని చెప్పగా.. వెనక నుంచి ఎస్‌జే సూర్య వచ్చి ప్లస్ 15 మినిట్స్ అంటాడు. మొత్తం 2 గంటల 50 నిమిషాలు అంటే సుందరానికి కూడా ఇదే రన్ టైం కదా అంటూ ఎస్‌జే సూర్య అనగా.. అంటే కాదు.. 'సరిపోదా శనివారం' అంటూ నాని అనడం ఇది ఒక యా క్షన్ మూవీ అండ్ లవ్ స్టోరీ అంటూ వీడియోను వదిలారు

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాఘవ లారెన్స్



**బలగం టీవీ, హైదరాబాద్**

కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వర స్వామిని కోలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ దర్శించుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ సమయంలో స్వామివారి సేవలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఇక లారెన్స్‌కు టీటీడీ అధికారులు ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అయితే తిరుమలకు వచ్చిన లారెన్స్‌ను చూసిన అభిమానులు భక్తులు సెల్ఫీల కోసం పోటీ పడ్డారు.